సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శనిగరం ప్రాజెక్టు కింద సాగవుతున్న వంట పొలాలు

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని గౌరవెల్లి రిజర్వాయర్‌లోకి ట్రయల్‌రన్‌తో దుంకుతున్న కాళేశ్వరం జలాలు (ఫైల్)

గౌరవెల్లి ప్రాజెక్టు స్వరూపం

ప్రాజెక్టు సామర్థ్యం: 8.23 టీఎంసీలు

ఎఫ్ఆర్ఎల్ +415 మీ | టీబీఎల్ +419 మీ

లైవ్ స్టోరేజీ: 7.822 టీఎంసీలు

డెడ్ స్టోరేజీ: 0.408 టీఎంసీలు

ఆయకట్టు: 1,20,000 ఎకరాలు

భూసేకరణ: (పాతది 1814, కొత్తది 2056 మొత్తం 3870 ఎకరాలు)

గౌరవెల్లికి గంగమ్మ ఎదురెక్కె!

బీడు భూములు బంగారమాయే • పూర్తయిన గౌరవెల్లి రిజర్వాయర్ • జూన్ 29నే ట్రయల్‌రన్ సక్సెస్

- రైతుల దశాబ్దాల కల సాకారం
- 4 జిల్లాల్లో 1.20 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటి భరోసా
- సీఎం, హరీశ్‌కు హుస్నాబాద్ నియోజకవర్గ రైతుల కృతజ్ఞతలు

"రాళ్లు రప్పలతో నిండిన గుట్టల ప్రాంతం. సాగునీటికి అల్లాడిన రైతాంగం. పూర్తిగా వర్షాధార మెట్ట పంటలు. వరుణుడు కరుణిస్తే చేతికి పంటలు. కాలం కలిసి రాకుంటే వలసబాటలు.. ఇదీ ఒకనాటి హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజల దుస్థితి. నాటి ఉమ్మడి పాలకులు గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మిస్తామని హామీ ఇచ్చి శిలాఫలకాలు వేశారే తప్ప తట్టెడు మట్టి ఎత్తిపోయలేదు. రైతుల గోడు పట్టించుకోలేదు. ఈ ప్రాంత రైతుల బాధను కండ్లారా చూసిన కేసీఆర్.. గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తిచేసే పనిని భుజానికెత్తుకున్నారు. రైతుల ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా కాళేశ్వరం కట్టి ఆ నీటిని సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ వరకు ఎత్తిపోశారు. ఇటీవలే గౌరవెల్లి ప్రాజెక్టు ట్రయల్ రన్ విజయవంతంగా పూర్తయింది. దశాబ్దాల హుస్నాబాద్ ప్రజల కల సాకారమైంది. నాలుగు జిల్లాల్లో 1.20 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటి భరోసా ఏర్పడింది.

సిద్దిపేట, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్ నియోజకవర్గం పూర్తిగా మెట్టప్రాంతం. ఇక్కడ గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మించాలని ఉమ్మడి పాలకులు శంకుస్థాపన చేశారు. ఎస్సారెస్పీ ఫ్లడ్ ఫ్లో ద్వారా మిడ్ మానేరుకు, అక్కడి నుంచి తోటపల్లి ఆన్‌లైన్ రిజర్వాయర్ ద్వారా గౌరవెల్లి లిఫ్ట్ కెనాల్‌తో నీటిని నింపేలా 2008-09లో ప్రాజెక్టు పనులు ప్రారంభించారు. తర్వాత పనులు పడకేశాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2015లో ముఖ్యమంత్రి కేసీఆర్.. మంత్రి హరీశ్‌రావు, స్థానిక ఎమ్మెల్యే ఒడితెల సతీశ్‌కుమార్, కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్‌తో కలిసి గౌరవెల్లి, గండిపెల్లి రిజర్వాయర్ల నిర్మాణ ప్రతిపాదిత స్థలాన్ని సందర్శించారు.గౌరవెల్లి ప్రాజెక్టు సామర్థ్యం 1.41 టీఎంసీ నుంచి 8.23 టీఎంసీలకు పెంచారు. ఆ మేరకు భూసేకరణ చేశారు. ముంపు గ్రామాలకు కొత్త చట్టం ప్రకారం పరిహారం అందించారు. ఈ ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాలకు సాగు నీరు అందించి మెట్ట ప్రాంతం సస్యశ్యామలం చేయడం కోసం యుద్ధ ప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టును పూర్తి చేసింది. జూన్ 29నే ట్రయల్‌రన్ ద్వారా రిజర్వాయర్‌లోకి 0.5 టీఎంసీల కాళేశ్వరం జలాలను ఎత్తిపోసింది.

రాజరాజేశ్వర జలాశయం నుంచి నీళ్లు

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని శ్రీరాజరాజేశ్వర జలాశయం (మిడ్ మానేరు) నుంచి తోటపల్లి ఆన్‌లైన్ రిజర్వాయర్ ద్వారా గోదావరి జలాలు గౌరవెల్లి రిజర్వాయర్‌లోకి వచ్చి పడ్డాయి. తోటపల్లి నుంచి నార్లాపూర్ వరకు 8 కిలోమీటర్ల లింక్ కెనాల్ ద్వారా నీళ్లు వస్తాయి. అక్కడి నుంచి గొట్లమిట్ట వరకు అప్రోచ్ కెనాల్ 3 కిలోమీటర్లు ఉంటుంది. ఇక్కడి నుంచి సుమారుగా 12 కి.మీ. మేర సొరంగం ద్వారా రేగొండ పంప్‌హౌస్‌కు కాళేశ్వరం జలాలు చేరుకుంటాయి. రేగొండ వద్ద పంపుల ద్వారా నీటిని గౌరవెల్లి రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తారు. 32 మెగావాట్ల 3 మోటార్లు 126 మీటర్లు ఎత్తిపోసే విధంగా మహాబలి మోటర్లు బిగించారు. ఒకటో నంబర్ పంప్‌ను ఆన్ చేసి ఇటీవలే రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తి పోశారు. కాళేశ్వరం జలాలను తాకిన చేతులతోనే సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు చిత్రపటాలకు చేతులెత్తి మొక్కారు.

గౌరవెల్లి ప్రాజెక్టు ద్వారా 1,06,000 ఎకరాలకు సాగునీరు

గౌరవెల్లి ప్రాజెక్టు ద్వారా 1.06 లక్షల ఎకరాలకు సాగునీరు అందనున్నది. కుడి ప్రధాన కాల్వ ద్వారా 90,000 ఎకరాలకు, ఎడమ ప్రధాన కాల్వ ద్వారా 16,000 ఎకరాలకు సాగు నీరు అందిస్తారు. సిద్దిపేట, వరంగల్ అర్బన్, కరీంనగర్, జనగామ జిల్లాల రైతులకు ఎంతో మేలు కలుగుతుంది. హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట, హుస్నాబాద్, కోహెడ, సైదాపూర్, చిగురుమామిడి, భీమదేవరపల్లి మండలాల్లోని 57,852 ఎకరాలకు సాగు నీరు అందుతుంది. స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గంలోని వేలేరు, ధర్మసాగర్, భీమదేవరపల్లి, ఖాజీపేట, చిల్పూర్, స్టేషన్‌ఘనపూర్, రఘునాథపల్లి, జాఫర్‌గఢ్ మండలాల్లోని 48,148 ఎకరాలకు సాగునీరు అందిస్తారు. గౌరవెల్లి కుడి, ఎడమ ప్రధాన కాల్వలది పోను, మిగతా 14 వేల ఎకరాలకు గండిపల్లి కుడి, ఎడమ కాల్వల ద్వారా సాగునీరు అందిస్తారు. గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టుల ద్వారా మొత్తం 1,20,000 ఎకరాలకు సాగునీరు అందిస్తారు.

మానేరు లాగా గౌరవెల్లి డ్యాం..

డ్యాం అంటే మానేరు డ్యామేనని ఎరుక. గట్లాంటి మన కరువు జాగల కేసీఆర్ సార్ పెద్ద డ్యాం కట్టించుడు సంతోషంగా ఉంది. నీళ్లే మనకు ఆధారం. ఈ డ్యాంకనక కట్టకుంటే మన రైతులది బిచ్చపు బతుకే అయితుండే. డ్యాంలతోనే మన బతుకులు బాగుపడుతయి. బాయిల్ల, బోర్లల్ల నీళ్లు ఉబ్బుతయి. ఎవుసం మంచిగ నడుస్తది. దీనిమీదనే మంచిగ బతుకొచ్చు.

-గొల్లపల్లి నర్సయ్య, రైతు, మాలపల్లి, హుస్నాబాద్ మండలం

కలల కూడా అనుకోలే...

గౌరవెల్లి డ్యాం కలల కూడ ఇది అయితది అనుకోలే. దీంతో రైతులకు సానలాభం, ఎవసం సేసుకునేటోల్లకు నీళ్లు కావాలె. ఆ నీళ్లు ఉండాలనే డ్యాం కట్టుడు. డ్యాంతో రైతులకు ఇప్పుడు ఇబ్బంది లేకుంట అయ్యింది. డ్యాంలకెల్లి జాలువారిన రెండు పంటలు పండుతయి. ఈ డ్యాం పడుడు మా రైతులకు సానలాభం. ఎవుసం సెయ్యబట్టి కూలికిపోవుడు బంద్‌అయ్యింది.

-కొంరెల్లి, రైతు, చౌటకుంట (సిద్దిపేట జిల్లా)

తొమ్మిదేండ్లలో రూ. 9,076 కోట్లు

- అభివృద్ధి పథంలో హుస్నాబాద్
- మారిన నియోజకవర్గ రూపురేఖలు
- గౌరవెల్లి ప్రాజెక్టుతో తీరిన రైతుల కల
- సీఎం కేసీఆర్ సహకారంతో అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే సతీశ్ కుమార్

సిద్దిపేట, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించింది. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాల కోసం తొమ్మిదేండ్లలోనే రూ. 9,076 కోట్లు వెచ్చింది. నియోజకవర్గాన్ని సస్యశ్యామలంగా మార్చే గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణానికి రూ.2700 కోట్లు కేటాయించింది. యుద్ధప్రాతిపదికన పనులు జరిపి రైతుల కలను సాకారం చేసింది. హుస్నాబాద్ మున్సిపాలిటీ భవనం, దవాఖాన, మాతా శిశు సంరక్షణ కేంద్రం, ఎల్లమ్మ చెరువు సుందరీకరణతోపాటు అంతర్గత రహదారులు, ఇండోర్ స్టేడియంతోపాటు ఏసీపీ కార్యాలయం, విద్యుత్తు డీఈ కార్యాలయ భవనాల నిర్మాణానికి రూ.245 కోట్లు ఖర్చు చేశారు. సోషల్ వెల్ఫేర్ ఎస్టీ గురుకులం, బంజారాభవన్, షాదీఖాన భవనాలను రూ.101 కోట్లతో నిర్మించారు. అక్కన్నపేట, కోహెడ మండలంలో 12 చెక్ డ్యాంలను రూ.70 కోట్లతో, సైదాపూర్, చిగురుమామిడి మండలాల్లో పంట కాల్వలను రూ.79 కోట్లతో నిర్మించారు. సమీకృత కార్యాలయ భవన సముదాయ నిర్మాణానికి రూ.19 కోట్లు వెచ్చించారు. సింగరాయ ప్రాజెక్టును రూ.5 కోట్లతో ఆధునీకరించారు. చేపపిల్లల పంపిణీకి రూ.22 కోట్లు ఖర్చుచేశారు.

కండ్ల ముందు కనిపిస్తున్న అభివృద్ధి

ప్రతి సంవత్సరం వెయ్యి కోట్ల నిధులతో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు కండ్ల ముందు కనిపిస్తున్నాయి. హుస్నాబాద్‌లో సెంట్రల్ లైటింగ్, హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు మినీట్యాంక్ బండ్ సుందరీకరణ వంటి పనులు ఒకనాడు ఎట్లున్న హుస్నాబాద్ ఇప్పుడెలా మారిందో సాక్షాత్కరిస్తున్నది. స్థానిక ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుంచారు. 2014, 2018లో వరుసగా రెండు పర్యాయాలు ఇక్కడి నుంచి ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా సతీశ్‌కుమార్‌నే సీఎం కేసీఆర్ నిలబెట్టారు. ఈ సారి విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టాలనే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు పని చేస్తున్నారు.

కాలం లేక పడావు పెట్టినం

గింత పెద్ద డ్యాం పడుతదని, సూత్తమని ఎన్నడు అనుకోలే. మా తండాలల్ల నీళ్లులేక ఎవుసం సెయ్యలే. కాలం లేక ఎవుసం అంతపడావు ఉండేది. రిక్షా తొక్కడానికి ముప్పై ఏండ్లు పోయిన. సీఎం కేసీఆర్ సార్ చెయ్యబట్టే డ్యాం అయ్యింది. రైతులకు బగ్గ లాభం అయితది. డ్యాం నిండితే మా దిక్కు పంటలు మంచిగ పండుతయి.

-మాలోతు రెడ్డి, రైతు, చౌటకుంట (సిద్దిపేట జిల్లా)

నేడు బీఆర్ఎస్ మ్యానిఫెస్టో

- రాబోయే ఐదేండ్ల ప్రగతి ప్రణాళికను వెల్లడించనున్న సీఎం కేసీఆర్
- 119 మంది అభ్యర్థులకు బీ-ఫారాలు ఇవ్వనున్న అధినేత
- హుస్నాబాద్‌లో ప్రజా ఆశీర్వాద సభ ద్వారా ప్రచారానికి శ్రీకారం

హైదరాబాద్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): ఎన్నికల సమరానికి పూర్తిగా సన్నద్ధమైన బీఆర్ఎస్ విశ్వరూప ప్రదర్శనకు సిద్ధమైంది. ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన పార్టీ అధినేత కేసీఆర్.. ఆదివారం ఉదయం తెలంగాణ భవన్‌లో మ్యానిఫెస్టోను విడుదల చేయనున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిస్తే వచ్చే ఐదేండ్లలో ప్రజల సంక్షేమం, అభివృద్ధికి బీఆర్ఎస్ ఏం చేయబోతున్నదన్న పూర్తి ప్రణాళికను వివరించనున్నారు. హామీలను చెప్పడమే కాకుండా, వాటి అమలుకు తమ వద్ద ఉన్న వనరులు, అమలు విధానాలను కూడా కేసీఆర్ ప్రజలకు వెల్లడించనున్నారు. ప్రజల అవసరాలు తీర్చేలా, రాష్ట్ర ప్రగతికి ఉపయోగపడేలా మ్యానిఫెస్టో తీర్చిదిద్దినట్టు బీఆర్ఎస్ వర్గాలు చెప్తున్నాయి. మ్యానిఫెస్టో రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులు సృష్టిస్తుందని, సకల జన సంక్షేమంగా ఉంటుందని అంటున్నాయి. ఎన్నికల సందర్భంగా నేతలంతా మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లేలా ఇప్పటికే ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఇందులోని అంశాలపై విస్తృతంగా చర్చ పెట్టనున్నారు.

అభ్యర్థులకు బీ-ఫారాలు

బీఆర్ఎస్ అభ్యర్థులందరికీ సీఎం కేసీఆర్ ఆదివారమే బీ-ఫారాలు అందజేయనున్నారు. ఇప్పటికే అభ్యర్థులను తెలంగాణ భవన్‌కు రావాలని పిలిచారు. మొత్తం 119 నియోజకవర్గాలకు చెందిన అభ్యర్థులకు ఒకేసారి బీ-ఫారాలు ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా వారికి ఎన్నికల వ్యూహాన్ని వివరిస్తారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య మ్యానిఫెస్టో విడుదల, బీ-ఫారాల అందజేత కార్యక్రమం ఉండనున్నది. అనంతరం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో స్థానిక అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌బాబు అధ్యక్షతన జరిగే పార్టీ ఎన్నికల సభకు సీఎం కేసీఆర్ బయల్దేరి వెళ్తారు. ఈ సభతో మొదలయ్యే కేసీఆర్ ఎన్నికల ప్రచార సభలు ప్రతి రోజు 2-3 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొనసాగనున్నాయి.

తొలిరోజు బాలాత్రిపుర సుందరిదేవిగా దుర్గమ్మ

హైదరాబాద్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ శరన్నవరాత్రుల్లో భాగంగా తొలిరోజైన ఆదివారం బాలాత్రిపుర సుందరీ దేవిగా సాక్షాత్కరించనున్నది. ఈ రోజు రెండు నుంచి పదేండ్లలోపు బాలికలను అమ్మవారి స్వరూపంగా భావించి పూజించి కొత్త బట్టలు పెడతారు.

నేటి నుంచి తిరుమల బ్రహ్మోత్సవాలు

హైదరాబాద్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. నవరాత్రి బ్రహ్మోత్సవాలకు శనివారం టీటీడీ అంకురార్పణ చేసింది. ఆదివారం నుంచి ఈ నెల 23 వరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నెల 19న సాయం త్రం 6:30 గంటలకు శ్రీవారి గరుడోత్సవం ఉంటుంది. ఆదివారం నుంచి ఈ నెల 23 వరకు శ్రీవారి ఆర్జిత సేవలను, ప్రత్యేక దర్శనాలను రద్దు చేశారు.

హుస్నాబాద్ నుంచి హుషారుగా..

- కేసీఆర్‌కు అచ్చొచ్చిన గడ్డ హుస్నాబాద్
- గత రెండు ఎన్నికలకు ఇక్కడి నుంచే ప్రచారానికి శ్రీకారం
- వచ్చే ఎన్నికల శంఖారావానికి కూడా ఈ ప్రాంతమే ఎంపిక
- నేడు భారీగా 'ప్రజా ఆశీర్వాద సభ'
- హుస్నాబాద్‌కు గులాబీదండు

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో 2018లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్ (ఫైల్)

సిద్దిపేట, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఎన్నికల శంఖారావం పూరించేందుకు బీఆర్ఎస్ సిద్ధమైంది. తనకు అచ్చొచ్చిన హుస్నాబాద్ నుంచే సీఎం కేసీఆర్ వచ్చే శాసనసభ ఎన్నికల శంఖారావాన్ని పూరించనున్నారు. హుస్నాబాద్ నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉన్నది. ఇది రాష్ట్రంలో ఈశాన్య ప్రాంతంలో ఉంటుంది. ఇది కలిసి వచ్చే అంశం కావడంతో బీఆర్ఎస్ తొలి బహిరంగ సభ ఇక్కడే నిర్వహించాలని పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయించారు. 2014, 2018 శాసనసభ ఎన్నికలకు సైతం ఇక్కడి నుంచే 'ప్రజా ఆశీర్వాద సభల'తో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ప్రతి ఎన్నికల ముందు సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం కోనాయిపల్లి వేంకటేశ్వరాలయంలో సీఎం కేసీఆర్ ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తున్నది. వీటన్నింటి కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి ఇప్పటి వరకు కేసీఆర్‌కు హుస్నాబాద్‌తో విడదీయరాని అనుబంధం ఉన్నది. ఈ నియోజకవర్గంలోని సబ్బండ వర్ణాలు ఉద్యమంలో కలిసి వచ్చాయి. ఉద్యమ స్ఫూర్తిని నింపుకొని గత ఎన్నికల్లో భారీ మెజార్టీ ఇచ్చాయి. అందుకే ఎన్నికల శంఖారావాన్ని మళ్లీ ఇక్కడి నుంచే శ్రీకారం చుట్టాలని ప్రజా ఆశీర్వాద సభను నిర్వహించబోతున్నారు.

నియోజకవర్గం సస్యశ్యామలం

తనకు అచ్చొస్తున్న హుస్నాబాద్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో 1.24 టీఎంసీల సామర్థ్యం ఉన్న గౌరవెల్లి రిజర్వాయర్‌ను 8.23 టీఎంసీలకు సీఎం కేసీఆర్ పెంచారు. హుస్నాబాద్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయాలని కోట్ల నిధులను కేటాయించారు. మహాసముద్రం గండిని స్వయంగా సందర్శించి నిధుల కేటాయించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించారు. హరితహారంలో ముందుండాలనే లక్ష్యంతో హుస్నాబాద్‌లో స్వయంగా మొక్కలు నాటి ఇక్కడి ప్రజలకు కేసీఆర్ స్ఫూర్తినిచ్చారు. మరోసారి హుస్నాబాద్ నుంచే ఎన్నికల శంఖారావం పూరించి ఎన్నికల్లో ఘన విజయం సాధించాలనే లక్ష్యంతో ముందుకు పోతున్న సీఎం కేసీఆర్.. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తారని ప్రజలు ధీమా వ్యక్తంచేస్తున్నారు.

పోలీసు కిష్టయ్య కుమార్తెకు మెడిసిన్ పీజీలో సీటు

- 24 లక్షల ఫీజు చెల్లించిన ముఖ్యమంత్రి కేసీఆర్
- చల్మెడ ఆనందరావు మెడికల్ కాలేజీలో అడ్మిషన్
- సీఎం కేసీఆర్ సార్ మేలు మరువలేం : ప్రియాంక

తెలంగాణ అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య కూతురు డాక్టర్ ప్రియాంక

కరీంనగర్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): తెలంగాణ మలిదశ ఉద్యమంలో అమరుడైన కానిస్టేబుల్ కిష్టయ్య.. తన కూతురు ప్రియాంకను డాక్టర్‌ను చేయాలని కలలు కనేవాడు. కిష్టయ్య అమరత్వంతో ఆ కుటుంబం పెద్దదిక్కును కోల్పోయి కుటుంబపోషణే భారమైంది. ఈ సమయంలో సీఎం కేసీఆర్ ఆ కుటుంబాన్ని అక్కున చేర్చుకుని అండగా నిలిచారు. ముఖ్యమంత్రి ప్రోత్సాహంతో ప్రియాంక వైద్యవిద్యను పూర్తిచేస్తున్నారు. ఇప్పటికే ఎంబీబీఎస్ పూర్తి చేసి.. బస్తీ దవాఖానలో వైద్యురాలిగా సేవలందిస్తున్నారు. ఇంతటితో సంతృప్తి చెందక.. మెడిసిన్‌లో పీజీ చదవి గైనకాలిజిస్టుగానో.. జనరల్ సర్జన్‌గానో సేవలందించాలని అనుకున్నారు. ఈ విషయాన్ని ఇటీవల కలిసినప్పుడు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా.. మెడిసిన్‌లో పీజీ చదవడానికయ్యే ఖర్చు భరిస్తానని హామీ ఇచ్చారు. అనుకున్నట్టుగానే.. నీట్‌లో పీజీ ఎంట్రెన్స్‌లో బీ క్యాటగిరీ మేనేజ్‌మెంట్ కోటాలో జనరల్ సర్జన్ సీటు సంపాదించారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం.. శనివారం ఆమె ఫీజు రూ.24 లక్షలు చెల్లించారు. ఈ మేరకు కరీంనగర్‌లోని చల్మెడ ఆనందరావు మెడికల్ కళాశాలలో మెడిసిన్ పీజీలో అడ్మిషన్ తీసుకున్నారు. దీంతో తమ కుటుంబానికి సీఎం కేసీఆర్ చేసిన మేలు ఎప్పటికీ మరువలేమంటూ డాక్టర్ ప్రియాంక, కిష్టయ్య భార్య పద్మావతి సంతోషం వ్యక్తం చేశారు. 'నన్ను డాక్టర్‌ను చేయాలని మా నాన్న కన్న కలను సీఎం కేసీఆర్ సార్ నెరవేర్చారు. ఇప్పుడు పీజీ కూడా చదివిస్తున్నారు. మా నాన్న ఆత్మహత్య చేసుకున్న తర్వాత కేసీఆర్ సార్ మా కుటుంబానికి పెద్ద దిక్కులా ఉన్నారు. హైదరాబాద్‌లో అమర జ్యోతి ఆవిష్కరణ రోజు సీఎం సార్‌ను కలిసి పీజీ చదవాలన్న విషయాన్ని చెప్పాను. సీటు సంపాదించుకో తప్పక చదివిస్తానని హామీ ఇచ్చారు. సీటు వచ్చింది. కేసీఆర్ సార్ ఫీజు చెల్లించారు. చాలా సంతోషంగా ఉంది. ఈ విషయంలో నాకు సహకరించిన ఎంపీ సంతోష్‌కుమార్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌కు మా కుటుంబం తరపున కృతజ్ఞతలు' అంటూ ప్రియాంక ఆనందం వ్యక్తం చేశారు.

నేడు హుస్నాబాద్‌లో ప్రజాఆశీర్వాద సభ

- సభకు భారీ స్థాయిలో ఏర్పాట్లు
- సక్సెస్ చేసేలా పార్టీ శ్రేణులకు మంత్రి హరీశ్‌రావు దిశానిర్దేశం
- నియోజకవర్గం నుంచి లక్ష మంది
- సభాస్థలిని పరిశీలించిన బోయినపల్లి వినోద్, సతీశ్
- సభకు పోలీసుల భారీ బందోబస్తు

హుస్నాబాద్‌లో శనివారం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, ఎమ్మెల్యే సతీశ్ తదితరులు

సిద్దిపేట, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీఆర్ఎస్ ఎన్నికల ప్రచార ప్రారంభ వేదికకు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ముస్తాబవుతున్నది. ఆదివారం నిర్వహించే ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు స్థానిక ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ నేతృత్వంలో పార్టీ శ్రేణులు ఏర్పాట్లుచేస్తున్నాయి. సాయంత్రం 4 గంటలకు హెలికాప్టర్‌లో సీఎం కేసీఆర్ సభాస్థలికి చేరుకొని ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు.. మూడు రోజులుగా ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌తో కలిసి పార్టీ కార్యకర్తల సమావేశాలు నిర్వహించి సభ విజయవంతానికి దిశానిర్దేశం చేశారు. హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి సభకు సుమారుగా లక్ష మంది తరలివచ్చేలా ఏర్పాట్లు చేశారు. హుస్నాబాద్‌లోని కరీంనగర్ రహదారిలో సబ్‌స్టేషన్ సమీపంలోని మైదానంలో 100 మంది కూర్చునేలా ఉత్తర దిశగా స్టేజీ ఏర్పాటు చేశారు. మహిళలు, వీఐపీలకు ప్రత్యేక గ్యాలరీలు, సభా ప్రాంగణ సమీపంలోనే హెలీప్యాడ్ ఏర్పాటు చేశారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. సభాస్థలిని శనివారం సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఆరు సెక్టార్లుగా పోలీసులు పటిష్ట బందోబస్తు పెట్టారు. పార్కింగ్ జోన్లు ఏర్పాటు చేశారు.

సభాస్థలిని పరిశీలించిన వినోద్, సతీశ్

హుస్నాబాద్‌లో ఆదివారం నిర్వహించే సభ ఏర్పాట్లను శనివారం సాయంత్రం బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు, స్థానిక ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, జడ్పీ వైస్‌చైర్మన్, రాజిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వేలేటి రాధాకృష్ణ శర్మ తదితరులు పరిశీలించారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

మూడోసారి గెలుపు తథ్యం: వినోద్‌కుమార్

తెలంగాణను ఇన్ని విధాలుగా అభివృద్ధి చేసిన కేసీఆర్‌ను మూడోసారి సీఎంగా చేసేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ చెప్పారు. హుస్నాబాద్‌లో ఆదివారం నిర్వహించే తొలి ప్రజా ఆశీర్వాదసభకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తున్నదని తెలిపారు. లక్ష మందితో సభను విజయవంతం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు శనివారం ఆయన మీడియాకు వెల్లడించారు.